క్లుప్తంగా

కురువల సంబరాలు



ఆలూరులో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న కురువ సంఘం నాయకులు

ఆలూరు: కర్ణాటకలో ముఖ్యమంత్రిగా సిద్దరామయ్య ప్రమాణ స్వీకారం చేయడంతో శనివారం ఆలూరు, హొళగుందలో కురువ సంఘం నాయకులు సంబరాలు చేసుకున్నారు. కేక్ కట్ చేసి, బాణా సంచా పేల్చి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో కురువ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, రంగస్వామి, మాదాసి, మాదారి కురువ సంఘం సీనియర్ నాయకులు మోహన్‌ప్రసాద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జయరాం పాల్గొన్నారు.

త్వరలో భూ పంపిణీ

తుగ్గలి: అసైన్‌మెంట్ కమిటీ ద్వారా నిబంధనల మేరకు మండలంలో త్వరలో భూ పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ రవి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలో భూ పంపిణీకి వచ్చిన దరఖాస్తుల పరిశీలన అనంతరం 232 మందికి 298.5 ఎకరాలు పంపిణీ చేసేందుకు పట్టాలు సిద్ధం చేస్తున్నామన్నారు. ప్రభుత్వ భూమిలో సాగులో ఉన్న వారికి 3 ఎకరాల వరకు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాక లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తామన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న డీఈ

తుగ్గలి: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ గురుప్రసాద్ అన్నారు. హౌసింగ్ డే సందర్భంగా శనివారం ఆయన తహసీల్దార్ రవి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎస్ఎం బాషాతో కలిసి పెండేకల్లు రైల్వే జంక్షన్‌లోని రామకొండ లేఅవుట్‌ను సందర్శించారు.

● కృష్ణగిరి: ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ మోహన్‌కుమార్ లబ్ధిదారులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని జగనన్న కాలనీని పరిశీలించారు.

● ఎమ్మిగనూరు రూరల్: ఇంటి నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ బంగారమ్మ సూచించారు. శనివారం గుడేకల్ గ్రామంలోని జగనన్న కాలనీని ఆమె పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు.

ట్రాక్టర్‌పై నుంచి పడి వ్యక్తి మృతి

ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని కోటేకల్ గ్రామ మలుపు వద్ద శనివారం సాయంత్రం ట్రాక్టర్‌పై నుంచి పడి సంతక్లూడూరు గ్రామానికి చెందిన మౌల(35) మృతి చెందాడు.. మౌల.. డ్రైవర్‌తో కలిసి ట్రాక్టర్‌పై ఎమ్మిగనూరుకు వడిగడ్డిని తీసుకెళ్లాడు. అక్కడ అన్‌లోడ్ చేసి తిరిగి గ్రామానికి బయలుదారారు. డ్రైవర్ వెనక కూర్చున్న మౌల.. కోటేకల్ బస్టాప్ సమీపంలో కింద పడ్డాడు. తలకు బలమైన గాయం కావటంతో వెంటనే ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

విద్యార్థి సంఘాల నిరసన

ఎమ్మిగనూరుటౌన్: నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు చేసుకుంటున్నారని ఆరోపిస్తూ ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు విజయేంద్ర, రామకృష్ణలు ఎంజీ ఇంగ్లిష్ మీడియం స్కూల్ ఎదుట శనివారం బైఠాయించి నిరసన తెలిపారు.

నూతన విద్యావిధానం వద్దు

ఎమ్మిగనూరుటౌన్: లోపభూయిష్టంగా ఉన్న జాతీయ నూతన విద్యా విధానం వద్దని డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గోట్ల చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు కరె కృష్ణ తదితరులు శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు.

కలికితురాయి 'జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్.!

● ఎమ్మిగనూరు–ఆదోని హైవేలో ఎంఐజీ కాలనీ
● 110.10 ఎకరాల్లో 1,106 ప్లాట్లు



ఎమ్మిగనూరు ఎంఐజీ కాలనీకి సిద్ధం చేసిన భూములు

ఎమ్మిగనూరు: ఎమ్మిగనూరు అభివృద్ధి చరిత్రలో జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ కలికితురాయిగా మారనుంది. ఆదాయపన్ను చెల్లింపుదారులకు ఎంఐజీ లేఅవుట్లను ఏర్పాటు చేసి సకల సౌకర్యాలు కల్పించే చర్యలు చేపట్టింది. అందులో భాగంగా జిల్లాలో మొదటి జగనన్న టౌన్‌షిప్ ఎమ్మిగనూరులో ఏర్పాటు కానుంది.

పట్టణ సమీపంలోనే..

ఎమ్మిగనూరు పట్టణానికి ఆరు కిలోమీటర్ల సమీపంలో బనవాసి అటవీ భూములున్నాయి. పశు సంవర్ధకశాఖకు చెందిన రెండు వేల ఎకరాల్లోని 110.10 ఎకరాల్లో ఎంఐజీ కాలనీ ఏర్పాటు చేయనున్నారు. కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) నేతృత్వంలోనే మధ్యతరగతి వర్గాలకు అందమైన కాలనీ ఏర్పాటు కానుంది.

టౌన్‌షిప్‌లో 1106 ప్లాట్లు

జగనన్న టౌన్‌షిప్‌లో 1,106 పాట్లు ఏర్పాటు చేస్తున్నారు. అందులో మూడు సెంట్ల ప్లాట్లు 447, నాలుగు సెంట్ల ప్లాట్లు 440, ఐదుసెంట్ల ప్లాట్లు 199 ఉన్నాయి. 3 సెంట్ల ప్లాట్ ధర రూ.8,62,290లు, 4సెంట్ల ప్లాట్ ధర రూ.11,45,800లు, 5 సెంట్ల ప్లాట్ ధర రూ.13.79.760. ప్లాట్‌లో 5 శాతం రిటైర్డ్ ఉద్యోగులకు, 10 శాతం ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక కేటాయింపులు ఉంటాయి. అలాగే ప్రభుత్వ ఉద్యోగులకు 20 శాతం, సింగిల్ పేమెంట్‌గా కట్టేవారికి 5 శాతం డిస్కౌంట్లు కూడా కల్పించారు.

నేడు కలెక్టర్‌చే జగనన్న టౌన్‌షిప్ బ్రోచర్ విడుదల

జిల్లా కలెక్టర్ సృజన ఆదివారం జగనన్న టౌన్ షిప్ బ్రోచర్‌ను విడుదల చేస్తారని కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. అలాగే 11 గంటలకు టౌన్‌షిప్ వెబ్‌సైట్ లాంచ్ చేస్తారన్నారు. ఎమ్మిగనూరు మాచాని సోమప్ప మెమోరియల్ హాల్‌లో జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు చెన్నకేశవరెడ్డి, సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, జాయింట్ కలెక్టర్ మౌర్య, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైస్ చైర్మన్ భార్గవ్‌తేజ, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు తదితరులు హాజరవుతారన్నారు.

అర్హులు

సంవత్సర ఆదాయం రూ.18 లక్షల లోపు ఉండాలి. 18 ఏళ్లు నిండి ఆదాయ పన్ను చెల్లింపుదారులై ఉండాలి. ఒక కుటుంబంలో ఒక్కరే అర్హులు. దరఖాస్తు సమయంలో 10 శాతం, అగ్రిమెంట్ చేసుకున్న తేదీ నుంచి నెలలోపు 30 శాతం, 6 నెలలకు 30 శాతం, 12 నెలలకు మరో 30 శాతం చెల్లించి రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలి. అన్ని షరతులకు లోబడి అర్హులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వెబ్‌సైట్ htt p://migapdtcp.ap.gov.in

వేరుశనగ మంజూరు

దేవనకొండ: మండలానికి 2,500 క్వింటాళ్ల వేరుశనగ మంజూరైందని ఏఓ సురేష్ బాబు తెలిపారు. స్థానిక ఆర్‌బీకేలో నిలువ ఉంచిన వేరుశనగలను ఏఓ శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరులోపు పంపిణీని ప్రారంభిస్తామన్నారు. క్వింటం రూ.9,580 కాగా 4,000 సబ్సిడీ పోనూ రైతు రూ.5,580 చెల్లించాలన్నారు. అవసరమైన రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్‌తో ఆర్బీకేలకు వెళ్లి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

● మద్దికెర: మండలానికి 1,050 క్వింటాళ్లు వేరుశనగ మంజూరైనట్లు ఏఓ హేమలత తెలిపారు. ప్రభుత్వం వర్షాలు ప్రారంభానికి ముందే విత్తనాలు పంపిణీ చేయడానికి సన్నాహాలు చేపట్టిందన్నారు. గ్రామాల వారీగా తేదీలు ప్రకటించి రైతులకు పంపిణీ చేస్తామన్నారు.

ఆదాయ వనరులు పెంచుకోవాలి

వెల్దుర్తి(కృష్ణగిరి): పంచాయతీలు ఆదాయ వనరులను పెంచుకోవాలని డీపీఓ నాగరాజునాయుడు సూచించారు. శనివారం ఆయన వెల్దుర్తిలోని సచివాలయం–3, డంపింగ్ యార్డులను పరిశీలించారు.

విధులను నిర్లక్ష్యం చేయొద్దు

ఆలూరు: విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఐసీడీఎస్ సీడీపీఓ లలిత అంగన్‌వాడీ కార్యకర్తలను, సిబ్బందిని హెచ్చరించారు. శనివారం స్థానిక 1వ అంగన్ వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి పలు సూచనలు ఇచ్చారు.

ప్రతి గ్రామాన్నీ అభివృద్ధి చేస్తాం



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీదేవి

మద్దికెర: నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శనివారం మద్దికెరలో రూ.45 లక్షలతో నిర్మించిన సచివాలయాన్ని ప్రారంభించారు. రూ.25 లక్షలతో నిర్మించనున్న ప్రభుత్వ కార్యాలయాల ప్రహరీకి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల వ్యాప్తంగా దాదాపు రూ.17 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. మరిన్ని నిధులు మంజూరు చేసి ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అనిత, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాసులు, జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, సర్పంచ్ సుహాసిని, ఐడీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వర్లు, మార్కెట్‌యార్డు చైర్మన్ పక్కీరప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేలు దేశానికే రోల్ మోడల్



రైతులకు సబ్సిడీ విత్తనాలు అందిస్తున్న శ్రీదేవి

వెల్దుర్తి(కృష్ణగిరి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆర్బీకేలు దేశానికే రోల్‌మోడల్‌గా నిలుస్తున్నాయని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. వెల్దుర్తి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆమె రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ మోహన్‌విజయ్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు సుంకన్న, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు రవిరెడ్డి, వెంకటనాయుడు, ఏఓ అక్బర్‌బాషా, వ్యవసాయ మార్కెట్‌యార్డు డైరెక్టర్ ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



వృద్ధుడికి బుక్‌లెట్ అందజేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని పెద్ద కమేళా, సున్నంబట్టీ ప్రాంతాల్లో వార్డు కౌన్సిలర్ ఖాశింబేగ్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కెఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీసి నాలుగేళ్లలో పొందిన లబ్ధిని వివరించి బుక్‌లెట్ అందించారు. డ్రైన్లు, సీసీ రోడ్లు, తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరగా ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు బుట్టా రంగయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ ఏర్పాటు

స్వచ్ఛ పట్టణం కోసం 'మేరా లైఫ్ మేరా స్వచ్ఛ షెహర్' కార్యక్రమంలో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్‌ఆర్‌ఆర్ (రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్) సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కెఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం పాత మున్సిపల్ కార్యాలయంలో ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌ను వారు ప్రారంభించి మాట్లాడారు.

నూతన విధానం కార్పొరేట్లకు లాభం



మాట్లాడుతున్న నాగమణి

గోనెగండ్ల: నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్యను పేదలకు దూరం చేసి కార్పొరేట్లకు కట్టబెడుతున్న కేంద్రంపై పోరాడాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగమణి, జిల్లా అధ్యక్షుడు యల్లప్ప సూచించారు. స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతుల్లో వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.అబ్దుల్లా, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తన విక్రయాలు అరికట్టాలి

ఆలూరు రూరల్: నకిలీ విత్తన విక్రయాలను అరికట్టాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గిడ్డయ్య డిమాండ్ చేశారు. శనివారం ఏడీఏ కార్యాలయం ఎదుట రైతు సంఘం నాయకులతో కలిసి ఆయన నిరసన చేపట్టారు. అనంతరం ఏడీఏ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందించారు.

● మద్దికెర: రైతులను నిలువునా ముంచేస్తున్న నకిలీ విత్తనాలు, మందులు విక్రయిస్తున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కౌలు రైతు సంఘ జిల్లా కార్యదర్శి హనుమప్ప, సీపీఐ మండల కార్యదర్శి నాగరాజు కోరారు. శనివారం స్థానిక వ్యవసాయ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం వ్యవసాయాధికారికి వినతిపత్రం అందజేశారు.

● ఎమ్మిగనూరు టౌన్: నకిలీ, నాణ్యత లేని పత్తి, మిరప విత్తనాలను విక్రయిస్తూ రైతులను మోసం చేస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు పంపణ్ణగౌడ్, తాలూకా కార్యదర్శి జబ్బార్ డిమాండ్ చేశారు. శనివారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేసి ఏఓ మహేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు.

● వెల్దుర్తి(కృష్ణగిరి): నకిలీ విత్తనాలను విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి కృష్ణ, రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాధకృష్ణ, బాలరాజు డిమాండ్ చేశారు.

● నందవరం: రైతులకు నకిలీ విత్తనాలు అంటగడుతున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పంపన్నగౌడ్ వ్యవసాయ విస్తరణ అధికారిణి ప్రభావతికి వినతి పత్రం అందజేశారు.

లోఓల్టేజీ సమస్య రానివ్వొద్దు

ఆలూరు రూరల్: వినియోగదారులకు లోఓల్టేజీ సమస్య తలెత్తకుండా చూడాలని విద్యుత్ శాఖ ఆదోని డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుధాకర్‌కుమార్ సూచించారు. శనివారం ఆలూరు డీఈఈ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విద్యుత్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోఓల్టేజీ కారణంగా ఆదోని సబ్ డివిజన్‌లో ఇప్పటి వరకు 218 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయన్నారు. లైన్‌మెన్‌లు గ్రామాలకు వెళ్లి లోఓల్టేజీ సమస్యను తెలుసుకుని పరిష్కరించాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లకు ఎర్తింగ్ ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు సిబ్బందికి సమాచారం అందించాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అవగాహన లోపం వల్లే ఇటీవలే హాలహర్వి మండలం మెదేహాళ్ గ్రామంలో విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందాడని గుర్తు చేశారు. బోరు కనెక్షన్ కింద రైతులకు సీనియారిటీ ప్రకారం ట్రాన్స్‌ఫార్మర్లు అందించాలన్నారు. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే ఏఈలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఆలూరు డీఈఈ నాగేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు చెరుకులపాడులో నారాయణరెడ్డి వర్ధంతి

వెల్దుర్తి(కృష్ణగిరి)/తుగ్గలి: వైఎస్సార్‌సీపీ నేత, ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి భర్త దివంగత నారాయణ రెడ్డి వర్ధంతి కార్యక్రమం ఆదివారం ఉదయం 10 గంటలకు చెరుకులపాడులో ఉంటుందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్‌కుమార్‌రెడ్డి, కృష్ణగిరి ఎంపీపీ కంగాటి వెంకటరామిరెడ్డి, తుగ్గలి మండల కన్వీనర్ జిట్టా నాగేష్‌యాదవ్ తెలిపారు. నారాయణరెడ్డి సమాధికి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కుటుంబసభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించి, మెగా రక్త దాన శిబిరాన్ని ప్రారంభిస్తారన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కృష్ణగిరి: స్థానిక మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నిర్మలాకుమారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశానికి ఓసీ, బీసీ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీలు రూ.150 ఆన్‌లైన్ ద్వారా జూన్ 7లోగా ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.